## 2

# మీ ఊరికి మా ఊరెంత దూరం?

ఆఫీసు నుండి ఇంటికి వచ్చాక రోజూలాగా తన గదిలోకి వెళ్ళి గోడవైపు చూస్తూ పడుకోలేదు నాగవేణి.

చక చకా తిరుగుతూ ఇంట్లో అస్తవ్యస్తంగా పడివున్న వస్తువులన్నీ ఎక్కడి వక్కడ పొందికగా సర్దింది.

తరువాత వంట మొదలు పెట్టింది. మామూలుగా అయితే అన్నం ఒక్కటీ వండి, ప్రొద్దున్న చేసిన ఆధరువులతో తినేసేవారు.

ఉల్లిపాయల సాంబారు వాసన, ఆ తరువాత అప్పడాలు నూనెలో వేయించిన గుబాళింపూ, ముహ్వొంకాయ కూర ఘుమఘుమలూ ఇల్లంతా అలముకున్నాయి.

ముందు వరండాలో పడక కుర్చీలో వాలి పేపరు చూస్తున్న అచ్యుతరామయ్య ఆరోజు వాతావరణం బట్టి ఏదో అర్థమయినట్టు చిన్నగా నిట్టూర్చాడు.

వంటకాగానే స్నానం చేసి ఇస్త్రీ చీరె కట్టుకుని జడలో మల్లె వుప్వుల దండ ముడుచుకుంటూ తండ్రిదగ్గరకు వచ్చింది నాగవేణి.

"రవి ఆలస్యంగా వస్తానన్నాడానాన్నా?" అని అడిగింది తండ్రి కుర్చీ పక్కనే నిలబడి.

"అల్లుడుగారు వచ్చేబస్సు తొమ్మిది గంటలకు గానీ రాదు కదమ్మా?" పేపరు మీద నుండి దృష్టి మరల్చకండానే అన్నాడాయన. తప్పు చేసినట్టుగా దోషిలాగా తలవంచుకుంది నాగవేణి.

ఆ అమ్మాయికి పెళ్ళై ఇంకా ఏడాది నిండలేదు.

భర్త శశిధర్‌కు నెల్లూరులో ఉద్యోగం. నాగవేణి కూడా ఉద్యోగస్థురాలే. పెళ్ళి అయ్యాక కూడా తండ్రి దగ్గరే వుండిపోయింది. ఆమె ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి.

పెళ్ళైన క్రొత్తలోనూ, తరువాత కూడా నోములనీ వ్రతాలనీ సెలవులన్నీ వాడుకున్నది.

ఇప్పుడు శశిధర్ పదిహేనురోజులకో నెలకో ఒకసారి ఆదివారం కలసి వచ్చేట్టుగా ఒకరోజు లీవు పెట్టి వచ్చి పోతున్నాడు.

"భోజనానికి వస్తావా నాన్నా.. ఇంకా ఆలస్యమా?" పది నిముషాల తరువాత మెల్లిగా అడిగింది.

అచ్యుతరామయ్య తలెత్తి గోడకున్న గడియారం వైపు చూసాడు. అప్పుడు టైము ఏడున్నర. రోజూ వాళ్ళు ఎనిమిదిన్నరకానిదే భోజనాలు చేయరు.

ఆయన మరోసారి నిట్టూర్చి "నా ఆలస్యం ఏమీ లేదు.... వస్తున్నా పదమ్మా. అన్నం వడ్డించు" అంటూ లేచాడు.

అంతలోనే బయటకు వెళ్ళిన రవి తిరిగి వచ్చాడు.

"కాళ్ళు కడుక్కుని రా రవీ .. నీకూ అన్నం పెట్టేస్తాను." అంది నాగవేణి. తండ్రి అంత పెందలాడే భోజనానికి కూర్చోవడం చూసి ఏదో అర్ధమయినట్టు గబగబ బట్టలు మార్చుకుని వచ్చి తండ్రి పక్కన కూర్చున్నాడు రవి.

"బావగారి నుండి ఉత్తరం వచ్చిందా అక్కా?" అక్కవైపు చూడకుండా తల వంచుకుని అన్నం కలుపుకుంటూ అడిగాడు రవి.

నాగవేణికి దుఃఖం వచ్చింది. ఉక్రోషం వచ్చింది. ఆవేశం కలిగింది.

"అవున్రా! రావొద్దని రాయడానికి టైము లేదు. నాఖర్మ... ఎన్నాళ్ళు ఇలాగ." అంది గొంతు జీర బోతుండగా.

"ఇప్పుడు నిన్ను ఏమన్నారమ్మా?" అన్నాడు అచ్యుత రామయ్య.

"ఎవరూ ఏమి అనరు నాన్నా... మీరూ మాట్టాడరు... ఆయనా మాట్లాడరు... మధ్యలో నలిగిపోయేదాన్ని నేనే" నాగవేణి గొంతు వణికింది.

క్రొత్తగా పెళ్ళైన ఆడపిల్లకి భర్త వస్తున్నాడన్న వార్త ఎంత సంతోషాన్ని కలిగించాలి? అతని రాక కోసం ఎంత ఆత్రుతతో ఎదురు చూడాలి? కానీ అతను వచ్చిన ప్రతిసారీ తను అడకత్తెరలో పోక చెక్కలా నలిగిపోతుంది. అతని కోసం, అతని సాన్నిహిత్యం కోసం తపించిపోయే మనసు తీరా ఆ ఘడియ వచ్చేసరికి ముడుచుకుపోతుంది. నాగవేణి నిట్టూర్చింది.

తొమ్మిదీ పది నిముషాలకు శశిధర్ వచ్చాడు.

ముందు గదిలో విశ్రాంతి తీసుకుంటున్న అచ్యుతరామయ్య హడావుడిగా లేచి కూర్చున్నాడు. "రా బాబూ! బస్సు సరైన టైముకే వచ్చినట్టుంది కదూ? ప్రయాణంలో బాగా అలసిపోయి వుంటావు. ఇంట్లో అందరూ కులాసాయేనా?" అంటూ సాదరంగా కుశల ప్రశ్నలు వేసాడు.

అన్ని ప్రశ్నలకు 'ఊ' అన్న ఒక్క ముక్క సమాధానమిచ్చి లోపలికి కదిలాడు శశిధర్.

పక్క గదిలో చదువుకుంటున్న రవి బావగారి రాకను గమనించనట్టుగానే వుండి పోయాడు.

అతడిది వుడుకురక్తం. తనని నిర్లక్ష్యం చేసే వారిని గౌరవించగల సహనం లేదతనికి. తన ప్రవర్తన అక్కకు బాధ కలిగిస్తుందని తెల్సినా బావగారి ప్రవర్తనను హర్షించలేక పోతున్నాడు.

తండ్రితో భర్త ముభావంగా వున్నా, అతని మౌనం ముల్లులా గుచ్చుకున్నా చిరునవ్వుతో శశిధర్ చేతి నుండి బ్రీఫ్ కేసు తీసుకుంది నాగవేణి.

"అత్తయ్యా మామయ్యా బాగున్నారా? ఇందిరకు చూసిన పెళ్ళి సంబంధం ఏమయ్యింది?" అంటూ కుశల ప్రశ్నలు వేసింది.

"ఆ.. అందరూ బాగున్నారు. వాళ్ళకు చెల్లాయి నచ్చిందట, వచ్చే నెలలో తాంబూలాలు తీసుకుందాం అన్నారు. ఆరోజుకు నువ్వు జీతనష్టం మీదైనా సరే సెలవు పెట్టి రావాలని చెప్పమంది అమ్మ" అన్నాడు శశిధర్ పంచె కట్టుకుంటూ.

అతను చెప్పిన తీరు నాగవేణికి చురుక్కున గుచ్చు కున్నట్టయింది.

"రెండు నెలల క్రిందట రవికి వడుగు చేస్తే సెలవు వుండికూడా మీరు రాలేదు గుర్తుందా" అని అడగాలనిపించింది.

ప్రయత్నపూర్వకంగా మనసును అదుపులో పెట్టుకుంది.

"అదేంమాట? ఇందిర పెళ్ళికి నిశ్చయతాంబూలాలు పుచ్చుకుంటుంటే నేను రాకుండా ఎలా వుంటాను? పదండి భోజనం చేద్దాం"... అంది ప్రసన్న వదనంతో.

'మామయ్యా, రవీ భోజనం చేసారా?' అని అతను అడగలేదు. ఆమె చెప్పలేదు.

అక్కడవున్న రెండ్రోజుల్లో మామగారితో, బావమరిదితో రెండుమాటలు కూడా మాట్లాడలేదు శశిధర్.

పెళ్ళిరోజు సాయంత్రం రిసెప్షన్‌కు మామగారు మంచి ప్రోగ్రాం ఏర్పాటు చేయలేదని ఆయనమీద అలిగాడు శశిధర్..

ఆరోజునుండీ ప్రచ్ఛన్న యుద్ధం ప్రకటించినట్టుగా ప్రవర్తిస్తున్నాడు.

నాగవేణికి బదలీ కావడం కొంత ఆలస్యం కావొచ్చని తెలిసాక ఆమె ఆ ఊళ్ళోనే వేరే ఇల్లు అద్దెకు తీసుకుని వుంటే తనరాకపోకలకు బావుంటుందని సూచనగా అన్నాడు శశిధర్.

ఎంతో గంభీరంగా వుండే నాగవేణి అతని మాటలకు చలించిపోయింది. రోషకషాయిత నేత్రాలతో అతనివైపు చూసి తలదించుకుంది.

మరొకసారి వేరేగా వుండటమన్నమాట ఎత్తలేదు శశిధర్. మామగారింటికి వచ్చి పోతున్నాడుగానీ వారితో మాట్లాడడు.

తలకు మించిన భారంగా మారినా కూతురి పెళ్ళి ఘనంగా జరిపించిన తండ్రికి ఆ కట్టుకున్నవాడు సరియైన మర్యాద నివ్వకపోవడం నాగవేణి మనసులో గాయంలా సలుపుతూనే వుంది.

తను అత్తవారింటికి వెళ్ళినప్పుడల్లా కొత్తకోడలైనా తన బాధ్యతగా ఇంటిపని మీద వేసుకుని చేసింది.

మామగారి ఎదుట ఎన్నడూ కూర్చోలేదు. అత్తగారు క్రింద కూర్చుంటే తనూ క్రిందే కూర్చునేది.

క్రితంసారి వెళ్ళినప్పుడు అత్తగారికి, ఆడబడుచుకు చీరెలు కొని తీసుకు వెళ్ళింది.

సంపాదిస్తున్న కోడలు ఆ మాత్రం చేయడం గొప్ప విషయం కాదన్నట్టుగా చాలా మామూలుగా తీసుకున్నారు వాళ్ళు.

ఆలోచిస్తూ అన్నం తింటున్న నాగవేణి భర్తమాటలకు వులికి పడింది.

"ఏమిటా పరధ్యానం? ఆచీరెలు తెమ్మని ఎవరడిగారు నిన్ను? ఊళ్ళో అందరికీ చెప్పినట్టున్నావు కదూ మా అత్తగారికి ఇంత ఖర్చుపెట్టి చీరెలు ఇచ్చానని..." శశిధర్ విసురుగా అన్నాడు.

"నేనెవరితోనూ అనలేదే" అంది నాగవేణి ఆశ్చర్యంగా. నువ్వు అనకపోతే మీ నాన్న చెప్పి వుంటాడు. "మా అమ్మాయి సంపాదనంతా అత్తగారింటికే పెడుతోంది అని. ఈ ఊళ్ళో వున్న మా దూరపు బంధువు మా అమ్మనడిగాడట "కోడలి సంపాదన బాగానే అనుభవిస్తున్నట్టున్నారే అని" శశిధర్ కోపంగా అన్నాడు.

"మానాన్న నెందుకు అనడం? పోనీలెండి నేను అత్తయ్య వాళ్ళకు పరాయి దాన్నేం కాదుగా. వాళ్ళకు చెయ్యవలసిన దాన్నే. ఆయనకు ఎలాగో తెలిస్తే సరదాగా అడిగి వుంటాడు." నాగవేణి మెత్తగా అంది.

"మీ నాన్న ఏం చేసినా బాగానే వెనకేసుకు వస్తావు. అందుకే మాచెల్లి చెప్పనే చెప్పింది" ఈ విషయం గురించి వదినెను అడగకురా అన్నయ్యా... ఎంతైనా మేము పరాయి వాళ్ళంకదా ఆమెకు అని. శశిధర్ వ్యంగ్యంగా అన్నాడు.

నాగవేణి తలెత్తి చురుక్కున చూసింది. "ఎవరు ఎవర్ని వెనకేసుకు వస్తున్నారో కాస్త ఆలోచిస్తే అర్థమవుతుంది. మొన్నసారి నేను వచ్చినప్పుడు మీ చెల్లి ఏమన్నది తెలుసా? 'ఆచీరెల ఖరీదెంతో చెప్పు వదినా! అన్నయ్య నడిగి ఇప్పిస్తాను' అంది. అంటే ఏమిటి అర్థం? నేను పరాయిదాన్ని మీరు వాళ్ళ స్వంతం అని కాదా? చిన్న విషయం మీతో చెప్పడం దేనికని వూరుకున్నాను. ఎవరు ఎవర్ని పరాయి వాళ్ళనుకుంటున్నారో తెలుస్తూనే వుందిగా". గొంతు హెచ్చించకండానే ఖచ్చితంగా అంది.

"మాటకు మాట బాగానే అందిస్తావు.. ఎంతైనా చదువుకున్నదానివి.. తెలివైనదానివి.." శశిధర్ ముఖం ముడుచుకున్నాడు.

ఎప్పుడో ఒకసారి కలుసుకునే క్రొత్తదంపతుల నడుమ మూడోవారి వలన కలహం రావడం నాగవేణికి కష్టమనిపించింది.

అందుకే ఆ మాట మార్చి తన ఆఫీసు కబుర్లు చెప్తూ శశిధర్‌ను మరిపించ ప్రయత్నించింది.

మర్నాడు రాత్రి బయల్దేరేముందు అన్నాడు శశిధర్. 'నీకు తొందరగా ట్రాన్స్‌ఫర్ అయితే బాగుండును. నాకు ఇలా పరాయి చోటికి వచ్చి వుండే ఈ శిక్ష తప్పుతుంది." అని.

మామగారితోగాని, బావమరిదితోగానీ మాట వరుసకైనా వెళ్ళొస్తానని చెప్పకుండా బయల్దేరిన మనిషి అలా అంటుంటే నాగవేణికి ఒళ్ళు మండింది.

'అదే తనయితే అత్తగారికి, మామగారికి కాళ్ళకు నమస్కారం చేసి, అందరికీ

పేరుపేరునా చెప్పి బయల్దేరుతుంది' అనుకుంటే మనసుకు నొప్పిగా అనిపించింది.

కానీ ప్రయాణమౌతున్న వ్యక్తితో వాదన పెట్టుకుని నొప్పించడం ఇష్టంలేక "వెళ్ళగానే ఉత్తరం రాయండి. అందర్నీ అడిగినట్టు చెప్పండి" అంది నవ్వు ముఖంతో.

ఆడబడుచు నిశ్చితార్థానికి ఒక్కరోజు సెలవు పెట్టి బయల్దేరింది నాగవేణి.

"ఏవమ్మా! ఇంటి కోడలివి... బాధ్యత మీద వేసుకుని చేయవలసిన దానివి. సాయంత్రం తాంబూలాలు పుచ్చుకోవడానికి వియ్యంకులు వస్తుంటే నువ్వు ప్రొద్దున్న దిగుతున్నావా? ఇంకానయమేలే. వాళ్ళతోబాటు సాయంకాలం వచ్చావు కావు" అంది అత్తగారు నాగవేణి లోపలికి వస్తుండగానే.

"పోనీలే అత్తయ్యా! మొత్తానికి వచ్చాను కదా! మా రవి వడుగుకి మీరెవరు రాలేకపోయినా కనీసం మీ అబ్బాయైనా ఒక పూట రాలేదు గదా.." అనేసి లోపలికి నడిచింది నాగవేణి.

అత్తగారు, కొడుకు వైపు చూసింది. క్రొత్తగా మాట్లాడుతుందేం? అన్నట్టు.

శశిధర్ మాట్లాడకండా బయటకు వెళ్ళిపోయాడు.

సాయంత్రం ఇంట్లో అందరూ హడావుడి పడుతుంటే నాగవేణి మాత్రం ఏపనీ పట్టించుకోకుండా వుండిపోయింది.

కోడలి ప్రవర్తనలో మార్పు మంటెక్కిస్తున్నా బంధువుల ముందు బయట పడలేక వూరుకుంది అత్తగారు.

"ఇల్లంతా లంకలా వుంది. నీ మానాన నువ్వు వెళ్తున్నావు.... సరేలే ఇక్కడికి బదిలీ అయ్యేక నీ ఇల్లు నువ్వు సర్దుకోవలసిందేగా" ! అంది అత్తగారు.

"ఈ ఇల్లంటారేమిటి అత్తయ్యా? మా ఇంటికి వచ్చి రెండ్రోజులు వుండటం పెద్ద శిక్షలా గుంది మీ అబ్బాయికి. నాకేమో ఇక్కడ పరాయి ఇంట్లో వున్నట్లే వుంటుంది. మనకంటూ ఒక సంసారం వుండాలి అన్నారు మీ అబ్బాయి...అందుకే నాన్నగారింట్లో కాకుండా వేరేగా ఇల్లు తీసుకుని వుండమని కూడా అడిగారు. ఇక్కడికి బదిలీ అయితే కూడా వేరే ఇల్లు తీసుకుని కాపురం పెట్టాల్సిందే కదా! అవును కదండీ?" అత్తగారితో మెత్తగానే చెప్పి భర్తనడిగింది నాగవేణి.

శశిధర్ ముఖం కోపంతో, రోషంతో ఎఱ్ఱబడింది.

ఆమెను ఏమనడానికీ లేకుండా తను అన్నమాటల్నే తిప్పి చెబుతున్నదాయె!

తల్లీ, చెల్లెలూ తనవైపు ఆశ్చర్యంగా చూస్తుంటే మరీ చిరాకనిపించింది శశిధర్‌కి.

"చాల్లే సరదాలు.. టైమవుతుందిగానీ రిక్షా ఎక్కు" అన్నాడు విసుగ్గా.

"వాన వచ్చేట్టుగా వుంది... అంతదూరం బస్టాండుకు మీరెందుకులెండి రావడం? నేను వెళ్తాను." అని అత్తగారికిగానీ మామగారికిగానీ, ఆడబడుచుకుగానీ వెళ్తున్నానని చెప్పనుకూడా చెప్పకుండా రిక్షా ఎక్కి కూర్చుంది నాగవేణి.

శశిధర్ మాటరాని వాడిలాగా చూస్తూ వుండి పోయాడు.

నెల్లాళ్ళ తరువాత ముందుగా ఉత్తరం రాయకుండా హఠాత్తుగా వచ్చాడు శశిధర్.

అచ్యుతరామయ్య పడక కుర్చీలో నుండి కంగారుగా లేస్తూ "అమ్మాయ్... అల్లుడుగారు వచ్చారు..." అంటూ కేకపెట్టాడు.

"మీరు కూర్చోండి మామయ్యా...నేను పరాయి వాడినేం కానుగా... ఈ మర్యాద లెందుకు?పోయిన సారి నేను వచ్చినప్పుడు మీకు బాగా జలుబు చేసి అవస్థ పడుతూ కనబడ్డారు. ఇప్పుడు ఆరోగ్యం బాగుందా? రవి కనబడడేం? పరీక్షకి బాగా చదివేస్తున్నాడా?" మామగారి కుర్చీకి ఎదురుగా వున్న చిన్న స్టూల్‌ని దగ్గరగా లాక్కుని కూర్చుంటూ కుశల ప్రశ్నలు వేసాడు శశిధర్.

అచ్యుతరామయ్య తబ్బిబ్బు పడ్డాడు. అంతలో అక్కడికి వచ్చిన నాగవేణిని చూసి "అమ్మాయ్ ... అల్లుడిగారికి ముందు కాస్తవేడి కాఫీ ఇచ్చి తరువాత భోజనానికి ఏర్పాటు చెయ్"... అన్నాడు.

రవి బావగారి మాటలు విని నవ్వు ముఖంతో వచ్చి శశిధర్ పక్కన కూర్చున్నాడు. "ఏమిటి బావగారు! నన్ను చెవులు మెలేసి మరీ చదివించేట్టు కనబడుతున్నారు..." అన్నాడు సరదాగా.

"బాబూ ...బాగా అలసిపోయివుంటావు ప్రయాణంలో... ఎన్నాళ్ళో మీకు ఈ శ్రమ...పాపం.." అచ్యుతరామయ్య నొచ్చుకుంటూ అన్నాడు.

"అదేమిటి మామయ్యా... పోయిన నెలలో మీ అమ్మాయి ఇంతదూరం ప్రయాణం చేసే అక్కడికి వచ్చిందిగా..." అన్నాడు శశిధర్ నవ్వుతూ....

"మాఊరికి మీ ఊరెంతదూరమో మీ ఊరికి మా ఊరు అంతే దూరమని తెలుసుకున్నారన్నమాట!" భర్తకు కాఫీ అందిస్తూ అతని కళ్ళలోకి చిలిపిగా చూసి నవ్వి అంది నాగవేణి.

'ఒప్పుకోకపోతే నువ్వూరుకుంటావా?' శశిధర్ కూడా నవ్వేసాడు.

వాళ్ళ సంభాషణ అర్థంకాని రవీ, అచ్యుతరామయ్య ఒకరి ముఖం ఒకరు చూసుకుని వాళ్ళూ నవ్వేసారు.

• *A.I.R. Kurnool-29-10-1993* •